## భద్రాచలంలో రెండో వారధి పనులను సత్వరం పూర్తి చేయాలి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం, డిసెంబర్ 17: భద్రాచలం పట్టణంలో గోదావరిపై నిర్మిస్తున్న రెండో వారధి పనులను సత్వరం పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అలతో కలిసి వారధి పనులను పరిశీలించారు. వారధి నిర్మాణానికి 2015లో నాడు తాను మంత్రి హోదాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. పనుల్లో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని, వారం రోజుల్లో పనులను ప్రారంభించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రహదారి పనులను ప్రారంభించాలన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మట్టి దొరకడం లేదని సైట్ ఇంజినీర్ చెప్పిన సమాధానంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు, ఏజెన్సీలు సమగ్ర నివేదికలతో త్వరలో కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న, అదనపు కలెక్టర్ రాంబాబు, ఎన్‌హెచ్ ఈఈ యుగంధర్, ఆర్ అండ్ బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, ఆర్డీవో మంగీలాల్ తదితరులున్నారు.

## నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం/కూసుమంచి, డిసెంబర్ 17: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 9 గంటలకు కలెక్టరేట్ చేరుకుని పాలేరు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి తన క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికలు



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 17: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 14, 17 బాల, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఎంపికలకు ఉభయ జిల్లాల నుంచి 75 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఎంపికైన వారిని 18 నుంచి బెల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి నరసింహామూర్తి, చెస్ జిల్లా కోచ్ ఇంటర్నేషనల్ క్రీడాకారుడు సీహెచ్ గోపీకృష్ణ, ఆర్బిటర్ బిస్వాజిత్ కృష్ణ, పీఈటీలు సైదేశ్వరరావు, రవి, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

ఎంపికైన బాలురు బాలురు: ఎస్కే మహ్మద్, వి.సాయివిష్ణేష్, ఎస్వీఎల్ఎస్ మణికంఠ, ఎస్కే ఆఫ్రిది, కె.సంకీర్త, శ్రీవివేక్, సీహెచ్ నాగవెంకటదుర్గా ప్రణవ్, కే రఘురాం, జే విజయ్‌కిరణ్ సందేశ్.

బాలికలు: బీ దివ్య, బీ పల్లవి, పీ సుధాశ్రీ, జే హర్షిత, జే శ్రీకళ, ఎం.వర్షిత, జీ లక్ష్మి సహస్ర, కే అహానా.

## అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఖమ్మం జట్టు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 17: హైదరాబాద్‌లో ఈనెల 23 నుంచి 25 వరకు జరుగనున్న 69వ సీనియర్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టు ఖరారైంది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వాహకులు క్రీడాకారులను ఎంపిక చేశారు. పోటీలను బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేజెళ్ల సురేష్, బొంతు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వారు క్రీడాకారులకు పటేల్ స్టేడియంలో మౌలిక సౌకర్యాలు కల్పించారు.

## ప్రజావాణికి సకాలంలో హాజరుకావాలి

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 17 : కొత్తగూడెం కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజావాణి ప్రారంభమవుతుందని, ప్రభుత్వ అధికారులు సకాలంలో ప్రజావాణికి హాజరుకావాలని అదనపు కలెక్టర్ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత గ్రీవెన్స్‌లో వచ్చిన వినతుల పరిష్కారంపై నివేదికలను వెంట తీసుకురావాలన్నారు. ప్రజలు వారి గ్రీవెన్స్‌కు విచ్చేసి సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయవచ్చన్నారు.

# సత్తుపల్లిలో గ్రంథాలయ భవనం ప్రారంభం

### పూజల్లో పాల్గొన్న ఎంపీ బండి, ఎమ్మెల్యే రాగమయి



గ్రంథాలయ భవనానికి ప్రారంభోత్సవం చేసిన రాజ్యసభ సభ్యుడు బండి, ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 17 : సత్తుపల్లి పట్టణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన అధునాతన గ్రంథాలయ భవనాన్ని హెటిరో సంస్థ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ప్రారంభించారు. సత్తుపల్లి బస్టాండ్ సమీపంలో రెవెన్యూ గెస్ట్‌హౌస్ స్థలంలో 17 కుంటల స్థలాన్ని కలెక్టర్ గ్రంథాలయం నిర్మాణం కోసం హెటిరో సంస్థకు అప్పగించారు. ఈ మేరకు సంస్థ చైర్మన్ పార్థసారధిరెడ్డి తన సొంత నిధులు రూ.2 కోట్లను ఖర్చుచేసి భవన నిర్మాణం పూర్తిచేశారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆ భవనంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఎమ్మెల్యే రాగమయి సమక్షంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మంజువాణికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీ బండి మాట్లాడుతూ తాను చదువుకున్న సత్తుపల్లి పట్టణంలో గ్రంథాలయం నిర్మించాలని గత ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు కోరిన మీదట తనకు సుందరమైన గ్రంథాలయ భవనం నిర్మించే అవకాశం కలిగిందన్నారు. గ్రంథాలయానికి అన్ని హంగులతో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన అనేకరకాల పుస్తకాలు ఏర్పాటు చేయడంతోపాటు డిజిటలైజేషన్ కూడా చేయించనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ప్రాంతం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సత్తుపల్లి ప్రాంతానికి ఎంపీ బండి పార్థసారధిరెడ్డి కృషి అభినందనీయమన్నారు. ఆయనకు జన్మనిచ్చిన గడ్డ రుణం తీర్చుకునేలా కందుకూరులో జూనియర్ కళాశాల నిర్మాణంతోపాటు కల్లూరు బస్టాండ్ నిర్మాణానికి కూడా ముందుకొచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ వనమా వాసు, ఎంపీపీ దొడ్డా హైమావతి, జడ్పీటీసీ కూసంపూడి రామారావు, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, కంటే నాగమణి, బీఆర్ఎస్ నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మల్లూరు అంకమరాజు, షేక్ రఫీ, మాధురి మధు, వీరపనేని బాబి, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వర్‌రావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, సాయిస్ఫూర్తి కళాశాల ఇన్‌చార్జి దాసరి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం సిటీ, డిసెంబర్ 17: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆదివారం సాయంత్రం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ విభాగాల్లో కలెక్టర్ కలియదిరిగారు. మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. పలు విభాగాల్లో అటెండెన్స్ రిజిస్టర్స్‌ను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్ఎంవో డాక్టర్ బీ రాంబాబు ఉన్నారు.



22 ఏండ్ల తర్వాత కలుసుకున్న టెన్త్ విద్యార్థులు

## మధుర జ్ఞాపకాలు 'పది'లం

### 22 ఏండ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు

రఘునాథపాలెం, డిసెంబర్ 17 : ఇరవై రెండు ఏండ్ల సుదీర్ఘకాలం తర్వాత వారంతా ఒకే వేదికపై ప్రత్యక్షమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు.. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.. మనసారా నవ్వుకున్నారు.. చదువుకున్న సమయంలో జరిగిన సంగతులను తలచుకుంటూ మురిసిపోయారు.. మైమరిచిపోయారు.. రోజంతా ఆనందంగా గడిపారు.. దీనికి ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కు వేదికైంది. తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి ఉన్నత పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సరదాగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్న వారంతా కొద్దిరోజుల క్రితం వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారు. ఈ నేపథ్యంలో వారంతా సరదాగా కలుసుకొని సంతోషంలో మునిగిపోయారు. మే నెల మొదటివారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవాలని తీర్మానించుకున్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుక





మాట్లాడుతున్న అలహాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ ఓటివర్

ఖమ్మం, డిసెంబర్ 17: ఖమ్మం నగరంలోని గొరిల్లా పార్క్‌లో ఆదివారం యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) అధ్యక్షుడు, కార్పొరేటర్ బి.జి.క్లెయిమెంట్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక జరిగింది. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షుడు జయకర్ డానియేల్, అలహాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ రెవరెండ్ జేపీ ఓటివర్, సీఎస్ఐ జోర్నకల్ దయాసిస్ జి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## 'భలే మంచి రోజు'.. పసందైన రోజు

### వీనుల విందుగా సాగిన ఘంటసాల జయంతి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం, డిసెంబర్ 17:'భలే మంచి రోజు.. పసందైన రోజు.. వసంతాలు పూచే నేటి రోజు..' అన్నట్లు ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఘంటసాల జయంతి వేడక జరిగింది. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు వాసూరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'సుధా'స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో 'భలే మంచిరోజు' పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో గాయకులు పాడిన ఘంటసాల పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో 'సుధా'స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.వాసుదేవ్, శఠగోపం సుదర్శన్, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, అధికారులు హెచ్.అరుణ్‌కుమార్, రవి పాడి, కళ్ల పాపారావు, మహ్మద్ అజీజ్, సాహెబ్, పంచాంగం విజయ సారథి, ఎస్వీ రమణ, మహ్మద్ జాన్‌సాహెబ్ పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఘంటసాల అభిమానులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616